జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 56 | గురువారం 17 జూలై 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

## ముగిసిన ముఖ్యమంత్రులు సమావేశం..



జూలై16 (సందేశం టైమ్స్): కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీ ఆర్ పాటిల్‌తో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం బుధవారం సాయంత్రం న్యూఢిల్లీలో ముగిసింది. జల వివాదాలపై సుమారు గంటన్నర పాటు ఈ సమావేశం కొనసాగింది. అయితే ఈ సమావేశంలో పోలవరం- బనకచర్ల ప్రాజెక్ట్ ఆవశ్యతను సీఎం చంద్రబాబు వివరించారు. గోదావరి నుంచి సముద్రంలోకి ఏటా 2 వేల నుంచి 3 వేల ప్రాజెక్టులు సముద్రంలో కలుస్తాయని తెలిపారు. ఈ నీటిని బనకచర్ల ద్వారా రాయలసీమకు మళ్లిస్తే ఆ ప్రాంతం లబ్ది చేకూరుతోందని ఈ సందర్భంగా చెప్పారు.అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు అందజేశారు. ఏ ఒక్క రాష్ట్రానికి ఇబ్బంది కలిగించకుండా.. సముద్రంలోకి వెళ్లి వెళ్లే గోదావరి మిగులు జలాలను వినియోగించుకోవడమే లక్ష్యమని సీఎం చంద్రబాబు ఈ సమావేశంలో స్పష్టం చేసినట్లు తెలుస్తుంది. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ఎజెండాలోని 13 అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్ట్‌ల విషయంలో సీఎం చంద్రబాబు ఎటువంటి అభ్యంతరం తెలపలేదు.

## డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయాలి



హైదరాబాద్, జూలై 16 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయాలని, భవిష్యత్తులో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను అధిగమించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క విద్యుత్ అధికారులను ఆదేశించారు. బుధవారం విద్యుత్ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 2024 నుంచి 9.8 శాతం చొప్పున పెరుగుతోందని.. 2034 నాటికి అది 33,773 మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర సంస్థలు విశ్లేషించినట్లు తెలిపారు. కొత్త సబ్‌స్టేషన్లను నిర్మించాలని, వాటి నిర్మాణ ప్రాంతంలో భూమి కోల్పోయిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించే విషయంపై దృష్టి సారించాలని సూచించారు. హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ కేబుల్స్ నిర్మాణం కోసం పూర్తిస్థాయిలో డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు స్థలం కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 12.5 మిలియన్ యూనిట్ల ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 16 మిలియన్ యూనిట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రెన్యూవబుల్ ఎనర్జీపై దృష్టి సారించాలన్నారు.

## బీసీ రిజర్వేషన్లకు రోల్ మోడల్.. తెలంగాణ




హైదరాబాద్, జూలై 16 (సందేశం టైమ్స్): బీసీ రిజర్వేషన్ల అంశంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. 'మనమెంతో.. మనకంత' అన్న రాహుల్‌గాంధీ నినాదాన్ని సమగ్రంగా అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ తీసుకుందన్నారు. విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలంటూ అసెంబ్లీలో బిల్లులను ఆమోదించి.. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు వీలుగా కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అలాంటి చరిత్రాత్మక ఘట్టంలో తనకూ భాగస్వామ్యం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా నన్నారు. బెంగళూరులో బుధవారం కర్ణాటక సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కామారెడ్డి సభలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో బీసీ డిక్లరేషన్‌ను తాను ప్రతిపాదించానని, ఆ సభకు సిద్దరామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారని గుర్తు చేశారు. ఇప్పుడు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో బీసీ రిజర్వేషన్ కోసం రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డితోపాటు సైనికుడిలా పనిచేస్తున్నానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అగ్రకులానికి చెందిన వారైనా బీసీ రిజర్వేషన్ అమలుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సమావేశాన్ని అక్టోబరు నెలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పార్టీ నేతలు వి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో బ్రిగేడ్ గ్రూప్ కొత్త కో వర్కింగ్ సెంటర్



జూలై 16 (సందేశం టైమ్స్) : రియల్టీ సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్.. హైదరాబాద్‌లో మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. హైటెక్ సమీపంలోని మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్ వద్ద 50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కో–వర్కింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. తన అనుబంధ సంస్థ బజ్‌వర్క్స్ ద్వారా బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ ఈ ప్రాజెక్ట్ చేపట్టింది. ఈ కో వర్కింగ్ కేంద్రంలో 1,000 మంది పని చేయవచ్చని ప్రకటించింది. కాగా కంపెనీ ఇప్పటికే హైటెక్ సిటీ సమీపంలోనే కో వర్కింగ్ సెంటర్‌ను నిర్వహిస్తోంది.




హైదరాబాద్, జూలై 16,(సందేశం టైమ్స్): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం పంచాయతీ రాజ్ శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్ టెరిటోరియల్ కాన్స్టిట్యూన్సీలు , మండల పరిషత్ టెరిటోరియల్ కాన్స్టిట్యూన్సీల , పంచాయతీ స్థానాల సంఖ్యను ఖరారు చేసింది. మొత్తం 566 జడ్పీటీసీ, మండల ప్రజా పరిషత్ స్థానాలు, అలాగే 5,773 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

### పంచాయతీల సంఖ్య..

ఇదే సమయంలో రాష్టంలో గ్రామ పంచాయతీల సంఖ్య 12,778 ఉండగా, వార్డుల సంఖ్య 1,12,000గా ఉంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే, 2019లో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. అప్పటి ఎన్నికల్లో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు 570 ఉండగా, ఎంపీటీసీ స్థానాలు 5,817, గ్రామ పంచాయతీలు 12,848గా ఉన్నాయి. ఈ నిర్ణయం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం చేసిందని చెప్పవచ్చు.

### గతంలో..

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు గతంలో జనవరి 30, 2024న ముగిసిన 12,845 గ్రామ పంచాయతీలు, 5,817 ఎంపీటీసీలు, 538 జడ్పీటీసీల గడువు తర్వాత నిర్వహించబడలేదు. ఈ స్థానాలు ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ఉన్నాయి. అయితే, ఈసారి జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల సంఖ్య 539 నుంచి 566కి పెరిగింది. ఇది 31 జిల్లా పరిషత్‌లలో నిర్వహించబడుతుంది. ఎంపీటీసీ స్థానాల సంఖ్య కూడా 5,817 నుంచి 5,773కి కొద్దిగా తగ్గింది.

### ఈసారి బీసీలకు..

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం రాష్ట్ర జనాభాలో 56% ఉన్న బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడానికి తీసుకున్న చర్యగా చెప్పవచ్చు. ఈ రిజర్వేషన్ విధానం కింద గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల యూనిట్లుగా, ఎంపీపీలు, జడ్పీటీసీలు జిల్లా యూనిట్లుగా, జడ్పీ చైర్పర్సన్‌లు రాష్ట్ర యూనిట్‌గా పరిగణించబడతాయి.

### ఆర్డినెన్స్ జారీ..

ప్రభుత్వం ఈ రిజర్వేషన్‌ను అమలు చేయడానికి ఒక ఆర్డినెన్స్ జారీ చేయనుంది. దీనిని రాష్ట్ర గవర్నర్‌కు పంపించారు. ఈ ఆర్డినెన్స్ చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, ప్రభుత్వం హైకోర్టు, సుప్రీంకోర్టులో కేవియట్‌లను దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తోంది.
ఈ ఎన్నికలు రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు కీలక పోటీగా ఉంటాయి. ఈ ఎన్నికల ద్వారా కాంగ్రెస్ పార్టీ గ్రామీణ స్థాయిలో తమ పట్టును బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఎన్నికలను ఆగస్టులో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు, సెప్టెంబరులో గ్రామ పంచాయతీలకు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల గోల్‌మాల్.. హరీశ్‌రావు కార్యాలయ మాజీ సిబ్బంది




జూబ్లీహిల్స్/ఆదిలాబాద్, జూలై 16 (సందేశం టైమ్స్) : బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి హరీశ్‌రావు కార్యాలయంలో చోటుచేసుకున్న సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల గోల్‌మాల్ విషయంలో అప్పటి సిబ్బందిని పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. ఇందులో మాజీ ఉద్యోగి జోగుల నరేశ్ కుమార్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించగా.. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. తాజాగా మరో ఇద్దరు బాధితుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సిద్దిపేటకు చెందిన రాళ్ల బండి వెంకటేశ్ 2022లో అనారోగ్యం బారిన పడగా.. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పగా వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. ఈ నేపథ్యంలోనే వెంకటేశ్ మాజీ మంత్రి హరీశ్‌రావు లెటర్‌పై సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. 2023 మార్చిలో వెంకటేశ్ తన స్నేహితుడి సాయంతో జూబ్లీహిల్స్‌లోని హరీశ్‌రావు కార్యాలయానికి వచ్చి సీఎం రిలీఫ్ ఫండ్ గురించి వాకబు చేశాడు.

# ఎపిని క్రీడా హబ్ గా తీర్చిదిద్దుతున్నాం.. కేంద్ర పరంగా చేయూత ఇవ్వండి - చంద్రబాబు

న్యూ ఢిల్లీ, జూలై16(సందేశం టైమ్స్): ఖేలో ఇండియా నిధులివ్వాలని కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ఎపి సిఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో పర్యటనలో ఉన్న చంద్రబాబు నేడు కేంద్ర మంత్రి మాండవీయను చంద్రబాబు కలిశారు. ఏపీలో స్టేడియంల నిర్మాణం, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి రూ. 341 కోట్ల కేటాయింపుల అంశంపై చర్చించారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో బ్యాడ్మింటన్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం చేపట్టాల్సిన ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల కల్పనపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. అమరావతిలో జాతీయ జల క్రీడల శిక్షణా హబ్ ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.. ఎపిలో క్రీడల అభివృద్ధికి కేంద్ర పరంగా తగిన సహాయం చేయాలని కోరారు.. అమరావతిలో అంతర్జాతీయ



ప్రమాణాలతో బ్యాడ్మింటన్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.అమరావతిలో జాతీయ జల క్రీడల శిక్షణ హబ్ ఏర్పాటుకు అవకాశం ఉందని, కృష్ణా నదీ తీరంలో వాటర్ స్పోర్ట్స్ శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు అవకాశాలున్నాయని వివరించారు, నాగార్జునా యూనివర్సిటీ, కాకినాడలలో నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ల ఏర్పాటుకు ప్రతిపాదించినట్టు వెల్లడించారు. తిరుపతి, రాజమహేం ద్రవరం, కాకినాడ, నరసరావుపేటలలో ఖేలో ఇండియా కింద మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధికి రూ.27 కోట్లు, గుంటూరు బీఆర్ స్టేడియంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు రూ.170 కోట్లు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి రూ.341 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, మరో కేంద్ర మంత్రి చంద్రశేఖర్, ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి కూడా పాల్గొన్నారు..

# బీసీల మహా ధర్నాలో ఎంపిటిసి తమన్న గారి సంగన్న

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 16జులై: హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద బీసీ ప్రజా ప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో బీసీల మహా ధర్నా నిర్వహించిన సభలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థలలో బీసీలకు 42% రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి ఎన్నికలు నిర్వహించాలని, అలాగే విద్య, ఉద్యోగాలలో బీసీలకు 42% రిజర్వేషన్‌ను అమలు చేయాలని పెద్ద ఎత్తున నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న %+% కుమార్ గౌడ్. శాసనమండలి ఎల్పీ లీడర్ మధుసూదన్ చారీ,సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ , మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్,శ్రీనివాస్ గౌడ్,జోగు రామన్న, మాజీ కార్పొరేషన్ మఠం బిక్షపతి బిసి నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని సభను విజయవంతం చేశారు



# టిడ్కో ఇళ్లకు స్థల సేకరణ - అధికారులను ఆదేశించిన నారా లోకేష్..

మంగళగిరి జూలై16(సందేశం టైమ్స్): గతంలో 3వేల మందికి సుమారు వెయ్యి కోట్ల విలువైన ఇళ్ల పట్టాలు అందజేశామని, ఆగస్టులో మరో 2వేలు పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు మంత్రి నారా లోకేష్ .. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఇళ్లు లేని పేదల కోసం కొత్తగా టిడ్కో గృహ సముదాయాల స్థలసేకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మంగళగిరిలోని ప్రస్తుత టిడ్కో సముదాయం వద్ద పార్కు అభివృద్ధికి చర్య తీసుకోవాలని సూచించారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మంత్రి ఈ రోజు ఉండవల్లి నివాసంలో అధికారులతో సమీక్షించారు. ఎంటీఎంసీ పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సమీకృత అండర్ గ్రౌండ్ డ్రైనేజి, వాటర్, గ్యాస్, పవర్ ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో సీఎస్ఆర్, ప్రభుత్వ నిధులతో నిర్మించ తలపెట్టిన




31 కమ్యూనిటీ హాళ్లు, 26 పార్కులు, శ్మశానాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# సీమకు జలసిరులు ..

## హంద్రీనీవా నుంచి నీరు విడుదల చేయనున్న చంద్రబాబు

అమరావతి,జూలై16(సందేశం టైమ్స్): కూటమి ప్రభుత్వంచొరవ, వేగవంతమైన నిర్ణయాలు రాయలసీమకు జలసిరులు తెచ్చాయి. హంద్రీనీవా ఫేజ్-1 కాలువల విస్తరణ పనులు పూర్తి కావటంతో సీమ జిల్లాలు సస్యశ్యామలం కానున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 17వ తేదీన నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద విస్తరణ పూర్తైన హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయనున్నారు.ముందు ప్రకటించినట్టుగానే వంద రోజుల్లో ఈ కాలువ విస్తరణ పనుల లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేసింది. రూ.696 కోట్లతో చేపట్టిన ఈ విస్తరణ పనులతో హంద్రీనీవా ఫేజ్ 1 కాలువ ప్రవాహ సామర్థ్యం 3850 క్యూసెక్కులకు పెరిగింది. రాయలసీమకు తాగు, సాగునీరివ్వాలన్న సంకల్పంతో రోజువారీ టార్గెట్లు పెట్టి మరీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫేజ్ 1, ఫేజ్ 2 కాలువ



పనుల్ని పరుగులు పెట్టించారు. ప్రస్తుతం ఫేజ్ 1 కాలువ విస్తరణ పనులతో అదనంగా 1600 క్యూసెక్కుల మేర నీటిని తరలించేందుకు అవకాశం కలిగింది. దీంతో జీడిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి సామర్థ్యంతో నీటిని నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తద్వారా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఆయకట్టుకు సాగునీరు, 33 లక్షల మంది ప్రజలకు దాహార్తిని తీర్చేలా కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసింది. మల్యాల నుంచి జీడిపల్లి వరకూ 216 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు పూర్తి కావటంతో జీడిపల్లి, కృష్ణగిరి, పత్తికొండ, గాజులదిన్నె సహా స్థానికంగా రాయలసీమ జిల్లాల్లోని చెరువులను కూడా నీటితో నింపనున్నారు. దీంతో సీమ జిల్లాల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగేందుకు ఆస్కారం కలిగింది.

# టీడీపీ ఖాతాలో మడకశిర మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు




- రామగిరి ఎంపీపీ ఎన్నిక మళ్ళీ వాయిదా
- ముగ్గురే హాజరు.. ఆరుగురు గైర్హాజరు
- కోరం లేక ముచ్చటగా మూడోసారి వాయిదా

శ్రీ సత్యసాయి జూలై16(సందేశం టైమ్స్) :శ్రీ సత్యసాయి జిల్లా లో బుధవారం జరిగిన ఉప ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ మడకశిర మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కైవసం చేసుకుంది. అయితే రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండల ఎంపీపీ ఎన్నిక మాత్రం ముచ్చటగా మూడవసారి వాయిదా పడింది.శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. చైర్మన్ గా 15వ వార్డు కౌన్సిలర్ నరసింహారాజు, వైస్ చైర్మన్ గా నాలుగో వార్డ్ కౌన్సిలర్ ప్రభావతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ తెలిపారు. కాగా మడకశిర మున్సిపాలిటీలో 20మంది కౌన్సిలర్లు ఉండగా టీడీపీ తరపున ఐదు మంది కౌన్సిలర్లు ఉండగా వైసీపీకి చెందిన 9మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోయారు. దీంతో టీడీపీకి మద్దతు 14కు చేరింది. దీనికి తోడు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఎక్స్ అఫిషియో సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు హాజరు కావడంతో మొత్తం 15కి చేరింది. కేవలం 6 మంది మాత్రం వైసిపి కౌన్సిలర్లు మిగిలారు. మున్సిపల్ ఎన్నికలను వైసీపీ కౌన్సిలర్లు ఆరుగురు బహిష్కరించారు.

# బీమాతో ధీమా

## బీమా నమోదుకు నెలాఖరు దాకా అవకాశం..
## కొన్ని పంటలకు ఆగస్టు 15 వరకు..
## ఆనందంలో అన్నదాతలు

నంద్యాల ఎద్యుకేషన్/రుద్రవరం, జూలై16(సందేశం టైమ్స్): ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోకుండా రైతులకు పంటల బీమా కొంత ఊరటనిస్తుంది. ఊహించని విపత్తుల వల్ల ఉత్పన్నమయ్యే పంటనష్టానికి గురైన రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రక్షణ కవచమనే చెప్పవచ్చు. జిల్లాలో పీఎంఎఫ్‌బీవై పథకం కింద 10 పంటలు ఎంపికయ్యాయి. వరి, మొక్కజొన్న, కంది, మి నుము, మిరప, జొన్న, సజ్జలు, కొర్ర, ఆముదం ఉల్లి పంటలకు బీమా సౌకర్యం కల్పించారు. వరి పంటకు మినహా ఇతర పంటలకు బీమా చేయించడానికి ఈనెల 31 వరకు అవకాశం ఉంది. వరితో పాటు వాతావరణ ఆధారిత బీమా పథకం కింద జిల్లాలో పత్తి, వేరుశనగ, నిమ్మ, అరటి పంటలకు బీమాకు నమోదు చేసుకోవడానికి ఆగస్టు 15వరకు అవకాశం ఉంది. వరికి గ్రామాన్ని యూనిట్‌గా, అరటి, పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, కంది, మినుము, మిరప పంటలకు మండలాన్ని యూనిట్‌గా, జొన్న, సజ్జలు, కొర్రలు, ఆముదం, ఉల్లి పంటలను జిల్లా యూనిట్‌గా తీసుకున్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా సౌకర్యం కల్పించడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# అమెరికా నుంచి మీ ఫోన్లను తెప్పించండి

హైదరాబాద్, జూలై 16(సందేశం టైమ్స్): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు బుధవారం మరోమారు సిట్ విచారణకు హాజరయ్యారు. ట్యాపింగ్ జరిగినప్పుడు ప్రభాకర్‌రావు వాడిన అధికారిక సెల్‌ఫోన్‌ను మాత్రమే ఆయన సిట్‌కు అందజేశారు. ల్యాప్‌టాప్, ట్యాబ్‌లలో డాటాను ఆయన డిలీట్ చేయడంతో.. సిట్ అధికారులు ఎఫ్ఎస్ఎల్ విశ్లేషణ, డాటా రికవరీకి పంపారు. అయితే.. ప్రభాకర్‌రావు ట్యాపింగ్ సమయంలో వాడిన రెండు సెల్‌ఫోన్లను అమెరికాలోనే వదిలేశారు. దీంతో.. "మీ ఫోన్లను అమెరికా నుంచి తెప్పించండి.." అంటూ సిట్ అధికారులు ప్రభాకర్‌రావును ఆదేశించారు. అధికారులు ఆయనను దాదాపు 8 గంటల పాటు ప్రశ్నించినా.. విచారణకు సహకరించలేదని తెలిసింది.

ఎస్ఐబీలో ఆధారాలను ధ్వంసం చేయడం, అక్రమంగా/మోసపూరితంగా పలువురి ఫోన్లను ట్యాపింగ్ చేయడం, ప్రభాకర్‌రావు వాడిన ఎలక్ట్రానిక్ పరికరాలపై సిట్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. "ఫోన్ ట్యాపింగ్ చేశాక.. ఆ సమాచారాన్ని ఎవరికి పంపేవారు?".. "ఎందుకోసం నిఘా పెట్టారు?".. అనే కోణాల్లో ప్రశ్నించారు. ఇప్పటి వరకు సిట్ అధికారులు 300 మంది బాధితుల వాంగ్మూలాలను నమోదు చేయగా.. వారిలో కొందరి పేర్లను ప్రస్తావిస్తూ.. "వారి నంబర్లను ఎందుకు ట్యాపింగ్ చేశారు? అంత అవసరమేమొచ్చింది?" అని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే.. సిట్ అడిగిన ప్రశ్నలకు ప్రభాకర్‌రావు చాలా వరకు సమాధానాలు చెప్పలేదని తెలిసింది. విచారణకు సహకరించకుండా.. మౌనంగా కూర్చున్నట్లు సమాచారం.



# సర్కారు బడికి జై.. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల జోరు

## బడిబాటలో 36,579 మంది విద్యార్థుల చేరిక
## మెరుగైన సౌకర్యాలు.. ఉత్తమ బోధన
## - ఇంగ్లీష్ మీడియంలో తరగతులు
## - ఆకర్షితులవుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన

రంగారెడ్డి అర్బన్:జూలై 16 (సందేశం టైమ్స్): జిల్లాలో 1,342 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 1,40,171 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌తోపాటు డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ డ్రెస్, మధ్యాహ్న భోజనం, బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులు వంటి అనేక రకాలైన సౌకర్యాలు కల్పిస్తున్నారు.దీనికి తోడు బడిబాటలో సర్కారు బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా బోధనపై విస్తృత ప్రచారం నిర్వహించారు. దీంతో ఈ ఏడాది మొత్తం 36,579 కొత్త అడ్మిషన్లు జరిగాయి. ఇందులో ఒకటో తరగతిలో 8,203, రెండో తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రైవేట్ బడుల నుంచి ప్రభుత్వ బడుల్లోకి 15,222, ప్రాథమిక, ప్రాథమికోన్నత నుంచి ఉన్నత పాఠశాలల్లో 13,154 మంది చేరారు. అలాగే ప్రత్యేక అవసరాలున్న పిల్లలను దగ్గరలో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించారు. విద్యార్థులకు టెక్ట్బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందజేశారు. సామూహిక లఅక్షరాభ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లాలోని ఆరు పాఠశాలల్లో అనుకున్న దానికంటే రెట్టింపు స్థాయిలో విద్యార్థులు చేరారు. ఆరుట్ల పాఠశాలలో 600 మంది విద్యార్థులు ఉండగా.. బడిబాటలో 1,400 మంది వరకు చేరారు. శంషాబాద్ మండలం ముచ్చర్ల బడిలో 78 మంది ఉంటే.. వీరి సంఖ్య 1,113కి చేరుకుంది. వేయి మందికిపైగా విద్యార్థులు అడ్మిషన్ పొందారు. ఫరూక్‌నగర్ మండలంలో 600 మంది పిల్లలు చేరారు. సింగరేణి కాలనీలోని బడిలో 25 మంది విద్యార్థులు ఎంఈవో సహకారంతో చేర్పించారు. మహేశ్వరం మండలం కోళ్లపడకల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 23, ఉన్నత పాఠశాలలో 35 మంది చేరారు. కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో పీఎసలో 20, హైస్కూల్లో 20 మంది చేరారు. శేఖర్‌రెడ్డి అనే వ్యక్తి రవాణ సౌకర్యం కల్పించడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది.

# మంచిర్యాలలో జంక్షన్ల కూల్చివేత



మంచిర్యాలటౌన్, జూలై 16 (సందేశం టైమ్స్)గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంచిర్యాల పట్టణంలో రూ.4కోట్ల వ్యయంతో రెండేళ్ల క్రితం ప్రధాన కూడళ్లలో నిర్మించిన జంక్షన్లను కూల్చివేస్తున్నారు. లక్ష్మి థియేటర్, టీటీడీ కల్యాణ మండపం చౌరస్తాల వద్ద నిర్మించిన వృత్తాకార జంక్షన్లను అధికారులు జేసీబీల సాయంతో కూల్చివేశారు. ఈ ప్రాంతాల్లో రోడ్లను విస్తరించాల్సి ఉందన్న దృష్ట్యా పెద్దసైజు ఐలాండ్లు ట్రాఫిక్‌కు అడ్డంకి మారుతున్నాయని భావించి, వాటిని తొలగించి చిన్న సైజు జంక్షన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.ఇదే తరహాలో ఐబీ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తాల్లోను ఇటీవల మార్పులు చేపట్టారు. గతంలో ఒక్కో జంక్షన్‌కు కోటి రూపాయల చొప్పున ఖర్చుపెట్టి గ్రీనరీ, శిల్పాలు, ఫౌంటెన్లు, లైటింగ్‌తో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరం లేకుండా ట్రాఫిక్ నియంత్రణకు వీటిని నిర్మించినట్లు అప్పటి ప్రణాళిక. మంచిర్యాల జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత పట్టణ అభివృద్ధిలో భాగంగా అప్పటి ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆధ్వర్యంలో ఈ జంక్షన్లు నిర్మించబడ్డాయి. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఇవి అవసరానికి మంచి ఉండడంతో, నగరశ్రేణి పెరుగుదలకు కొత్త ప్రణాళికలు అమలులోకి వస్తున్నాయి.

# సైబర్ వలలో చిక్కుకోకండి.. 'గోల్డెన్ అవర్' దాటకముందే 1930కి కాల్ చేయండి



చెన్నూర్ టౌన్ :జూలై 16 (సందేశం టైమ్స్): ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసగాళ్ల వలలో పడవద్దని చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్ రావు సూచించారు. మోసపోయామని తెలిసిన వెంటనే సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. పట్టణంలోని ఆదర్శ్ నగర్ కు చెందిన రత్న రాజేశ్ రెడ్డి కొద్ది రోజుల క్రితం సైబర్ నేరస్థుల చేతిలో మోసపోయి రూ.50 వేలు పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్లి తన సమస్యను వివరించాడు. %దీంతో చెన్నూర్ టౌన్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు పి.దేవేందర్ రావు నమోదు చేసి కేసు ఫైల్ చేశారు. ఇన్వెస్టిగేషన్ చేసి సైబర్ మోసగాడి బ్యాంకు ఖాతా నుంచి బాధితుడు రాజేశ్ రెడ్డి అకౌంట్‌కు 16 వేల రూపాయలు జమ చేయించారు. మనీ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాపీని బాధితుడికి సీఐ దేవేందర్ రావు అందజేశారు.

# హనుమకొండలో మహిళ ఆత్మహత్యాయత్నం.. ఎందుకంటే



హనుమకొండ, జూలై 16 (సందేశం టైమ్స్): జిల్లాలోని భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. తీసుకున్న అప్పు తీర్చకుండా కేసులు పెట్టి వేధిస్తున్నారని డబ్బులు ఇచ్చిన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పన్నెండు సంవత్సరాల క్రితం దేవన్నపేటకు చెందిన చంద్రశేఖర్ నుంచి ముల్కనూరుకు చెందిన గుడికందుల రమేష్ అప్పు తీసుకున్నాడు. కొంతకాలం తరువాత అప్పు తీర్చమని అడిగితే తీర్చకుండా రమేష్ ఇబ్బందులకు గురిచేశాడు. అప్పు తీర్చేందుకు రేపు, మాపు అంటూ వాయిదాలు వేస్తూ వచ్చాడు గుడికందుల రమేష్. దీనిపై చంద్రశేఖర్ పలుమార్లు పంచాయితీలు పెట్టినప్పటికీ రమేష్ పట్టించుకోలేదు. అంతేకాకుండా ముల్కనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు కూడా పట్టించుకోలేదు.న్యాయం కోసం దాదాపు నాలుగు నెలల నుంచి స్టేషన్ చుట్టూ బాధిత కుటుంబ సభ్యులు తిరుగుతున్న పరిస్థితి. ఈనెల 5న డబ్బులు చెల్లించేందుకు రమేష్ అగ్రిమెంట్ రాసిచ్చాడు. అయితే ఇచ్చిన గడువు వరకు డబ్బులు ఇవ్వకపోగా బాధితులపైనే ముల్కనూరు పోలీస్ స్టేషన్‌లో రమేష్‌ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు బాధితులను పోలీస్‌స్టేషన్‌కు రప్పించి విచారణ చేపట్టారు. మూడు రోజులుగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగారు బాధిత కుటుంబసభ్యులు. అప్పు ఇప్పించాల్సిన పోలీసులే తిరిగి బెదిరింపులకు పాల్పడటంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా స్టేషన్ చుట్టూ తిప్పించుకుంటున్నారని ముల్కనూరు ఎస్సైపై ఆరోపణలు గుప్పించారు.

# ఇక ధాన్యం ఆరబెట్టే శ్రమలేదు



చౌటుప్పల్ టౌన, జూలై 16 (సందేశం టైమ్స్): చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు గాను అఉనాతన యంత్రం (ప్యాడీ డయ్యర్)ను ప్రభుత్వం సమకూర్చింది. దీంతో రైతులకు జరిగే అనవసర వ్యయం తగ్గిపోతుండడంతో హర్షం వ్యక్తమవుతోంది. వ్యవసాయ మార్కెట్ నిధుల నుంచి రూ.14.40 లక్షలను కేటాయించి, ఈ యంత్రాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌యార్డులో భద్రపరిచారు. ధాన్యంతో ట్రయల్ రన కూడా చేశారు. ప్యాడీ డయ్యర్ రైతుల ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఎంతగానో ఉపయోగపడనుంది. ధాన్యాన్ని ఆరబెట్టడం, రాశులు చేయడం వంటి బాధలు ఇక నుంచి రైతులకు తప్పనున్నాయి. వ్యవసాయ పొలాల వద్ద కల్లాలు లేని ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్యాడీ డయ్యర్ ప్రాముఖ్యతను సంతరించుకుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టి రాశులు పోసుకునేందుకు గాను రైతులకు అధిక వ్యయం అవుతోంది. ఇక నుంచి ఇలాంటి ఖర్చులు, రైతుల శ్రమ తొలగిపోనున్నాయి. వానా కాలం సీజన లో ఈ యంత్రం 24 గంటలు పని చేయవలసి ఉంటుంది. ఇప్పటికే మా ర్కెట్ యార్డులో ప్యాడీ క్లీనర్ అందుబాటులో ఉంది. ప్యాడీ డయ్యర్, ప్యాడీ క్లీనర్ లతో రైతులకు ఎంతో ఉపయోగం జరగనుంది. ఈ ప్యాడీ డయ్యర్‌ను మార్కెట్ యార్డుకు కేటాయించేందుకు అదనపు కలెక్టర్ వీరా రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

# నిరుపేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేసిన మాజీ సర్పంచ్



సుల్తానాబాద్ రూరల్,జూలై 16 (సందేశం టైమ్స్): నిరుపేద విద్యార్థినికి పై చదువుల కోసం ల్యాప్‌టాప్‌ను వితరణ చేసి తన ఔదార్యాన్ని చాటుకున్న మాజీ సర్పంచ్. పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన మేకల ఓదెలు కూతురు బీటెక్ చదువుతుండగా ఆమెకు పైచదువుల కోసం ల్యాప్ టాప్ అవసరం ఉన్న విషయం తెలియడంతో వెంటనే స్పందించిన కాట్నపల్లి మాజీ సర్పంచ్ మోరపల్లి మోహన్ రెడ్డి దాదాపు రూ. 50 వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేసి బీటెక్ విద్యార్థి పూజితకు బుధవారం తన నివాసంలో అందజేశారు. తనకు అండగా నిలబడిన మాజీ సర్పంచ్‌కి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : కృష్ణవేణి



నిడమనూరు, జూలై 16(సందేశం టైమ్స్):విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిడమనూరు మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ, నిడమనూరు ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రంను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బా పాఠశాలలో భోజనం నాణ్యత, వంట గది పరిశుభ్రతను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం బోధనేతర సిబ్బందితో సమావేశమై విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని హెచ్చరించారు.


# ఇంటి ప్లాన్‌కు లంచం

**అనుమతి ఇచ్చేందుకు రూ.20వేలు డిమాండ్**
**ఏసీబీకి చిక్కిన నెల్లిమర్ల కమిషనర్**
**రూ.15వేలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా..**



నెల్లిమర్ల,జూలై 16 (సందేశం టైమ్స్): నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్ ఏసీబీకి పట్టుబడ్డారు. పట్టణంలోని పద్మశాలివీధిలో నివశిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి ఇంటి నిర్మాణానికి ప్లాన్ అనుమతి కోసం లంచం డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో తన గదిలో రూ.15వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రమ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి.నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని పద్మశాలివీధిలో నివశిస్తున్న బురడి మహేష్ అదే వీధిలో ఇల్లు నిర్మించుకుంటున్నాడు. ఆ ఇంటికి ప్లాన్ అనుమతి కోసం ఇటీవల పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. అనంతరం కమిషనర్ తారక్‌నాథ్‌ను సంప్రదించాడు. అనుమతి కావాలంటే రూ.20వేలు లంచం ఇవ్వాలని కమిషనర్ డిమాండ్ చేశారు. రూ.15వేలు నగదు రూపంలో మిగిలిన రూ.5వేలు దివాన్ కాట్ బెడ్ కోసం ఇవ్వాలని కోరారు. ప్లాన్ కోసం అవసరమైన ఫీజు చెల్లించానని, లంచం ఇవ్వలేనని మహేష్ ప్రాధేయపడ్డాడు. అయినా సరే కమిషనర్ అంగీకరించలేదు. దీంతో మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో నగర పంచాయతీ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌కు వెళ్లిన మహేష్ రూ.15వేలు అందజేశారు. లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమ్య ఆధ్వర్యంలో సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా కమిషనర్ తారక్‌నాథ్‌ను పట్టుకున్నారు. కేసు నమోదు చేశామని, బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.నగర పంచాయతీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తారక్‌నాథ్‌పై ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలో నిర్మాణంలో ఉన్న ప్రతి భవనం వద్దకు వెళ్లి లంచాలు డిమాండ్ చేస్తునట్లు విమర్శలు ఉన్నాయి. ఇదే విషయాన్ని గత మూడు దఫాలుగా జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు ప్రస్తావించారు. ఒకానొక సందర్భంలో బాధితులతోనే నేరుగా సమావేశాల్లో చెప్పించారు. అయినా సరే కమిషనర్ తీరులో ఏ మాత్రం మార్పు రాలేదు. అంతా సవ్యంగా జరిగితే ఈ నెలాఖరుకు ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇంతలోనే ఏసీబీ అధికారులకు పట్టుబడడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

# హైకోర్టు లాయర్ కిడ్నాప్ యత్నం



తుళ్లూరు జూలై 16 (సందేశం టైమ్స్): రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు ఎస్పీ కాలనీలో సోమవారం రాత్రి హైకోర్టు న్యాయవాది మేరిగ మోహన్‌రావు దంపతులను కిడ్నాప్ చేయడానికి ముగ్గురు దుండగులు యత్నించడం కలకలం రేపింది. బాధిత న్యాయవాది మోహన్‌రావు వివరాల ప్రకారం.. మోహన్‌రావు రాత్రి 7.30 గంటలప్పుడు ఇంట్లో ఉండగా గుర్తుతెలియని ముగ్గురు వచ్చి కేసు విషయమై మాట్లాడాలంటూ ఇంట్లోకి వచ్చారు. అనంతరం కత్తితో బెదిరిస్తూ మోహన్‌రావు, ఆయన భార్య జ్యోతి చేతులను తాళ్లతో కట్టి నోటికి టేపు అంటించారు. మోహనరావు చేతికి గాయమూ అయ్యింది. అనంతరం వారిని మోహన్‌రావు కారులోనే ఎక్కించారు. అయితే చాకచక్యంగా వ్యవహరించిన మోహన్‌రావు వారి నుండి తప్పించుకుని కారులో నుండి బయటపడ్డాడు. అనంతరం పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు గుమిగూడారు. దీంతో కిడ్నాపర్లు పరారయ్యారు. ఈ మొత్తం వ్యవహారం సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. ఆస్తి వివాదం నేపథ్యంలో తన చెల్లెలి కుమారుడి ప్రోద్బలంతో తనపై ఈ దాడి జరిగిందని మోహన్‌రావు చెబుఉన్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బందాలను రంగంలోకి దింపినట్టు సమాచారం.

# పోలీసులకు సవాల్ విసిరిన దొంగలు.. ఏకకాలంలోనే

శ్రీ సత్య సాయి జిల్లా,జూలై 16 (సందేశం టైమ్స్): జిల్లాలో దొంగలు బీభత్సం సృష్టించారు. భారీ ఎత్తున చోరీకి పాల్పడి పోలీసులకు సవాల్ విసిరారు దొంగలు. పుట్టపర్తి సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి స్టాఫ్ క్వార్టర్స్‌లో భారీ చోరీ జరిగింది. గత రాత్రి ఏకకాలంలో ఆస్పత్రి స్టాఫ్ క్వార్టర్స్‌లో దాదాపు పది ఇళ్లలో దుంగులు చోరీకి తెగబడ్డారు. మూడు బ్లాక్లుల్లో 10 నివాసాల్లో చోరీ చేసిన దొంగలు భారీ ఎత్తున నగదు, బంగారు నగలను అపహరించారు. రాత్రి ఆస్పత్రి స్టాఫ్ విధుల్లో ఉన్నారు. ఉదయం వచ్చి చూడగా తమ ఇళ్లల్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ప్రతీ ఇంట్లో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.అయితే ఒకేసారి 10 ఇండ్లలో చోరీ జరగడంతో ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అవాక్కైన పరిస్థితి. మరోవైపు దుండగులు చోరీ చేసిన ప్రదేశంలో కలెక్టర్ బంగ్లా కూడా ఉ ండడం విశేషం. నిరంతరం సెక్యూరిటీ ఉన్న ప్రాంతంలో చోరీ జరగడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ చోరీలపై పోలీసులు కేసు నమోదు చేసి అక్కడి సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అతి త్వరలోనే దుండగులను పట్టుకుని తీరుతామని పోలీసులు చెబుతున్నారు. ఇంత భారీగా దొంగతనం జరగడం పట్ల స్థానికులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే దొంగలను పట్టుకోవాల్సిందిగా పోలీసులను కోరుతున్నారు.

# సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె



నరసరావుపేటజూలై 16 (సందేశం టైమ్స్): సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరింది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సమ్మె శిబిరాన్ని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజరు కుమార్ సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. ప్రభుత్వం దిగివచ్చేంత వరకూ ఉద్యమించాలని, తాము అండగా ఉంటామని చెప్పారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులంతా ఎమ్మెల్యే అరవిందబాబును కలిసి వినతి పత్రం అందచేశారు. పిడిఎం నాయకులు ఎన్.రామారావు, బిసి సంఘం నాయకులు బి.శ్రీను, సంగమేశ్వరరావు, సల్మాన్, వీరకుమార్, జీవరత్నం మద్దతుగా పాల్గొన్నారు.

# ధరలున్నా.. తెగుళ్ల శాపం..!



సోమల,జూలై 16 (సందేశం టైమ్స్): ఏడాది పొడవునా సాగు చేసే టమోటా రైతుల్లో ఆందోళన నెలకొంది. సీజన్‌తో సంబంధం లేకుండా రైతులు టమోటా సాగుపై మొగ్గు చూపుతున్నారు. సోమల మండలంలో విస్తారంగా టమోటా సాగు చేపట్టారు. గత సీజన్‌లో రికార్డుస్థాయిలో ధరలు పలికిన టమోటా సాగుపై మక్కువ పెంచుకున్న రైతన్నలు సోమల, నంజంపేట, కందూరు, నెల్లిమంద, నడింపల్లె, ఇరికిపెంట, అన్నెమ్మగారిపల్లె తదితర పంచాయతీల్లో సుమారు 3,600 ఎకరాల్లో గత డిసెంబరు నుంచి విడతల వారీగా సాగు చేపట్టారు. 15 కిలోల బాక్సు జూన్ నెల వరకు రూ.30 నుంచి రూ. 60 మాత్రమే పలికి రైతులు నష్టాలపాలయ్యారు. కొందరు రైతులు కోత కూలీలు, రవాణా ఖర్చులు కూడా రాక చేతి నుంచి చెల్లించారు. మరికొందరు తోటల్లోనే కాయలను పశు వులకు మేతగా వదిలేశారు. ఫిబ్రవరి, మార్చి వరకు నాట్లు వేసిన తోటల్లో దిగుబడులు వచ్చిన రైతులు ఎకరా సాగుకు రూ.1.50 లక్షలు ఖర్చు చేసి నష్టపోయారు. ఏప్రిల్ నెలలో నాట్లు వేసిన తోటల్లో జూలై నెలలో దిగుబడులు వచ్చిన రైతులకు మాత్రమే 15 కిలోల బాక్సు రూ.100 నుంచి రూ.300 చేరుకోవడంతో పెట్టుబడులు మాత్రమే చేతికి అందాయి. ఈ సమయంలోనే వాతావరణం అనుకూలించక తోటల్లో పలు రకాల చీడపీడలు ఆశించడంతో వారంలో రెండు సార్లు మందులను పిచికారీ చేస్తూ వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. 100 బాక్సుల్లో 50 బాక్సులు ఊజీ ఈగల దాడులతో దెబ్బతిన్న కాయలు, నల్లమచ్చ కాయలు ఉండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఎండల తీవ్రతతో మొక్కలు ఎదుగుదల లేక పలు ఇబ్బందులు పడుతున్నారు. మూడు, నాలుగు సార్లు కోతలు కోస్తే దిగుబడులు తగ్గిపోతున్నాయి. ఈ పరిస్థితిలో నష్టాలే మిగులుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. టమోటాకు నల్లమచ్చలు, ఆకుముడత, తెల్లదోమ, పచ్చదోమలు వ్యాప్తి అధికంగా ఉండి మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోవడం, ధరలు ఉండి టమోటాలో నాణ్యత లేకపోవడంతో నష్టాలు చవిచూస్తున్నారు. టమోటా సాగుకు బిందుసేద్యం, కట్టెలు నాటడం, దారం వంటి ఖర్చులు పెరగడం, వాతావరణం అనుకూలించక వైరస్ ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. టమోటా తోటల్లో ఊజీ ఈగలు బెడదతో కోతలు చేయకుండానే తోటల్లోనే పండ్లను వదిలేస్తున్నారు. ధరలు కొంత ఊరటగా ఉన్నా ఊజీ ఈగలు, నల్లమచ్చ తెగుళ్లతో నష్టపోతున్నారు.

# ఎమ్‌టిఎస్ ఉపాధ్యాయుల్ని బలి చేయొద్దు



గుంటూరు :జూలై 16(సందేశం టైమ్స్): ఇటీవల జరిగిన బదిలీల్లో దూర ప్రాంతాల్లో, ముఖ్యంగా పల్నాడు జిల్లాలో పనిచేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానాల్లో పనిచేయటానికి ఎంటిఎస్ (మినిమం టైమ్ స్కేల్) ఉపాధ్యాయుల్ని నియమించాలని ప్రయత్నించటం సరికాదని ఎంటిఎస్ ఉపాధ్యాయులు వాపోయారు. తక్కువ జీతాలతో పనిచేస్తున్న తమను ఇష్టం వచ్చినట్లు, రోజుకో చోటకు మార్చొద్దని కోరారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులను రిలీవర్లుగా పంపిచటానికి డిఇఒ మంగళవారం వారిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఈ సందర్భంగా ఎంటిఎస్ ఉపాధ్యాయులు ఆర్‌జెడి ఎదుట వారి గోడు వెళ్లబోసుకున్నారు. రెండు వారాల క్రితమే తమకు కౌన్సెలింగ్ నిర్వహించి, ప్లేస్‌లు కేటాయించారని, పది రోజులు కాకుండానే ఇప్పుడు మళ్లీ దూర ప్రాంతాలకు వెళ్లమంటున్నారని తెలిపారు.

# ఎండ.. వడగాడ్పులతో జనం ఉక్కిరిబిక్కిరి



విశాఖపట్నం,జూలై 16 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో తీవ్రమైన ఎండ, వేడి వాతావరణం కొనసాగాయి. మధ్యాహ్నం సమయంలో వడగాడ్పులు వీచాయి. నరసాపురంలో అత్యధికంగా 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం కూడా కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వేడి వాతావరణం కొనసాగనుంది. అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గురువారం నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నందున ఆరోజు నుంచి వర్షాలు మొదలవుతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నెల 17 నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమల్లో, 18 నుంచి ఉత్తర, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

# ప్రాణం పోయినా గ్రామం విడిచేదిలేదు



వేపాడ, జూలై 16 (సందేశం టైమ్స్): ప్రాణం పోయినా సరే తమ గ్రామం వదిలి వెళ్లేది లేదని మారిక గిరిజను లు స్పష్టం చేశారు. తమ గ్రామానికి వచ్చిన అదానీ కంపెనీ ప్రతినిధులు, రెవెన్యూ అధికారులను సీపీఎం నాయకుడు చలుమూరి శ్యామ్ ఆధ్వర్యంలో ప్రతిఘ టించారు. తమ గ్రామంలో అదానీ కంపెనీ పెట్టవద్దని తెగేసి చెప్పారు. మారిక అడవితల్లిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమ పొట్టలు కొట్టొద్దని, మారిక కొండపై ఆధానీ పవర్ ప్లాంట్ పెట్టొద్దని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూడా అదానీ కంపెనీ కోసం అమాయక గిరిజనుల భూములను దౌర్జన్యంగా తీసుకునేందుకు ప్రయత్నించడం ఘోరమన్నారు. సీపీఎం నాయకుడు చలుమూరి శ్యామ్, గిరిజన నాయకుడు జాలారి వీర్రాజు, గమ్మెల బాబూరావు, సోమేష్, అప్పలనాయుడు, కరకవలస సర్పంచ్ పెంటమ్మల సారథ్యంలో రహదారికి అడ్డంగా బ్యానర్‌తో అడ్డంగా కంచె వేసి అడ్డుగా నిల్చొని ఆధానీ కంపెనీ ప్రతినిధులను, అధికారులను అడ్డుకున్నారు. ఈసందర్భంగా సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ మాట్లాడుతూ కష్టంలో రాజకీయ పార్టీలైన వైసీపీ, తెలుగు దేశం, జనసేన పార్టీలు తమకు మద్దతు ఇవ్వకుండా ఉండడం దారుణం అన్నారు. ఈ కార్యక్ర మంలో గిరిజన నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

# అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య



తాడికొండ జూలై 16 (సందేశం టైమ్స్): అప్పులు బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తాడికొండ సిఐ కె.వాసు వివరాల ప్రకారం౯%% మండలంలోని నిడుముక్కల గ్రామానికి చెందిన నెప్పల్లి సుబ్బారావు (60)కు ఎకరం పొలం ఉంది. దీనికితోడు మరో 20 ఎకరాలను కౌలుకు తీసుకుని రెండేళ్ళ గా సాగు చేస్తున్నాడు. అధిక వర్షాల కారణంగా పత్తిపంట దెబ్బతినడంతో తీవ్ర అప్పులు పాలైన సుబ్బారావు సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందువ తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆయన్ను కుటుంబీకులు గమనించి ఆటోలో గుంటూరులోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అప్పటి నుండి చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

# కడపజిల్లా సర్పంచి అరెస్టు



తిరుపతి(నేరవిభాగం),జూలై 16 (సందేశం టైమ్స్): వైసీపీ ప్రభుత్వంలో.. అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టిన కేసులో కడప జిల్లా ఉప్పరాండ్లపల్లికి చెందిన సర్పంచ్ షేక్ అష్రఫ్ అయూబ్‌బాషాను తిరుపతి సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చక్రాయపేట మండలం ఉప్పరాండ్లపల్లికి చెందిన సర్పంచి షేక్ అష్రఫ్ అయూబ్ బాషా వైసీపీకి విధేయుడు. 2024లో తన ఫేస్‌బుక్ ఖాతాలో చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టాడు. అప్పట్లో చక్రాయపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో తిరుపతిలో ఉన్నట్లు సీఐడీ పోలీసులకు సమాచారం వచ్చింది. అతడి సెల్‌ఫోను నెంబరును ట్రాక్ చేసి అరెస్టు చేశారు. గుంటూరు సీఐడీ కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐడీ సీఐ రంగస్వామి చెప్పారు.

# వరల్డ్ ఫుడ్ ఇండియా-2025'లో భాగస్వామిగా ఏపీ

## సెప్టెంబరు 25 నుంచి 28 వరకు ఢిల్లీలో మెగా ఈవెంట్




అమరావతి, జూలై 16 (సందేశం టైమ్స్): కేంద్ర పరిశ్రమల మంత్రిత్వ శాఖ సెప్టెంబరు 25 నుంచి 28 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న 'వరల్డ్ ఫుడ్ ఇండియా-2025'లో ఏపీ భాగస్వామిగా పాల్గొంటుంది. ఈ మేరకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ముడి పదార్థాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత, సహాయక మౌలిక సదుపాయాలను 'వరల్డ్ ఫుడ్ ఇండియా-2025'లో ప్రదర్శించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున సుమారు రూ.1.271 కోట్ల బడ్జెట్‌ను భరించడానికి ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీని నోడల్ ఏజెన్సీగా నియమించింది.

# చెరువులో చేపలు మృత్యువాత



దత్తిరాజేరు,జూలై 16 (సందేశం టైమ్స్): మండలంలోని దత్తి గ్రామ రెవెన్యూ పరిధిలో గల పాచిబంద చెరువులో వందల సంఖ్యలో చేపలు మృతిచెందాయి. దీంతో ఆ చెరువును లీజు తీసుకుని, చేపలు పెంచుతున్న పొట్నూరు ఈశ్వరరావు లబోదిబో మంటున్నారు. నాలుగు పైసలు చేతికి అందుతాయనే సమయంలో ఎవరో తెలి యని వారు విషప్రయోగం చేయడంతో చెరువులో చేపలు మొత్తం చనిపోయాయ ని విలపించారు. సుమారు లక్ష రూపాయలపైన నష్టం వాటిల్లిందని చెప్పారు. పెదమానాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# మా ఇంటికి స్మార్ట్ మీటర్ పెట్టొద్దు" స్టిక్కర్ ప్రచారం




విశాఖ:జూలై 16 (సందేశం టైమ్స్): విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల పూర్వ ఎమ్మెల్సీ ఎంవివిఎస్ శర్మ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. విశాఖలోని వార్వా, నివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వార్వా, నివాస్ ప్రచురించిన "మా ఇంటికి స్మార్ట్ మీటర్ పెట్టొద్దు" అనే స్టిక్కర్లను విడుదల ఆవిష్కరించారు. అనంతరం అక్కడున్న నివాసానికి ఆ స్టిక్కర్ ను అంటించి ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్వా నాయకులు బీబీ గణేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నో వాకింగ్..!




చింతలపూడి, జూలై 16 (సందేశం టైమ్స్): పట్టణ ప్రజల సౌకర్యార్థం చెరువుగట్టుపై మునిసిపల్ అధికారులు వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ఉద యాన్నే వాకింగ్‌కు వెళ్లినవారు వెనుదిరగాల్సిందే. వాకింగ్ ట్రాక్‌కు అధికా రులు తాళాలు వేసేశారు. అమృత్ 2.0 పథకంలో మునిసిపాలిటీ సుందరీ కరణ పేరుతో వేగిలింగేశ్వరస్వామి చెరువుగట్టు చదునుచేసి గేటు ఏర్పాటు చేశారు. దాతలు బెంచీలు, లైట్లు సమకూర్చారు. 'ఐ లవ్ చింతలపూడి' అంటూ లైటింగ్ బోర్డు ఏర్పాటు చేశారు. కానీ వాకింగ్ ట్రాక్ మాత్రం పట్టణ ప్రజలకు అందుబాటులో లేదు. రూ.78 లక్షలతో సుందరీకరణ చేపట్టిన చెరువు గట్టుకు ప్రజలు వెళ్లకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. తాళాలు ఎందుకు వేశారని అధికారు లను అడిగితే పశువులు మొక్కలు తినేస్తున్నాయని, తేళ్లు, పాములు వాకింగ్ ట్రాక్‌పైకి వస్తున్నాయని చెబుతున్నారు. వాకింగ్ ట్రాక్.. సుందరీ కరణ.. ఐ లవ్ చింతలపూడి ఎందుకని పట్టణ ప్రజలు నోరెళ్లబెడుతున్నారు.

# సంపాదకీయం

## మోదీ వారసుడిపై చర్చ అవసరమా?

డెబ్భైతొమ్మిదేళ్ల ట్రంప్ ఉదయాన్నే ఏ ట్వీట్ చేస్తారా అని ప్రపంచమంతా ఎదురు చూస్తుందని, కొద్ది పదాల్లో ఆయన వెల్లడించే అభిప్రాయాలు ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు, ప్రభుత్వాల విధానాలనూ ప్రభావితం చేస్తున్నాయని విదేశాంగ వ్యవహారాల నిపుణుడు ఒకరు వ్యాఖ్యానించారు. పెద్ద నోట్ల రద్దును ప్రకటించి అరగంటలో భారత ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసిన, వ్యవస్థలపై పట్టుబిగించిన నరేంద్రమోదీకి వచ్చే సెప్టెంబర్‌లో 75 ఏళ్లు నిండనున్నాయి. పరిపూర్ణ ఆరోగ్యవంతుడుగా కనిపించే మోదీ గురించి తెలియని భారతీయుడు ఇప్పుడు ఈ దేశంలో ఎక్కడా ఉండడు. అయిదుసార్లు రష్యా అధ్యక్షుడుగా గెలిచిన 74 ఏళ్ల పుతిన్ వర్తమాన ప్రపంచ శక్తిమంతమైన నాయకుల్లో ఒకరు. 75 సంవత్సరాలు ఇప్పటికే నిండిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇవాళ క్వాంటం వ్యాలీ గురించి మాట్లాడుతున్నారు. ప్రభుత్వ విధానాలే దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దుతాయని, 70 సంవత్సరాల వయసులో ప్రధాని అయిన పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు అమలు చేయాలని నిర్ణయించకపోతే ఇవాళ దేశం అభివృద్ధి పథంలో పయనిస్తూ ఉండేది కాదని మంగళవారం చంద్రబాబు ఢిల్లీలో పీవీ స్మారకోపన్యాసం వెలువరిస్తూ చెప్పారు. దేశ రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసేందుకు నాయకుల వయసుతో నిమిత్తం ఉండదని, ప్రజల అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగా నాయకులు క్రియాశీలంగా ఉన్నంతకాలం వారు తమ రాజకీయ జీవితంలో కొనసాగుతూనే ఉంటారని చెప్పేందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.అయినప్పటికీ ప్రజా జీవనంలో ఉన్నవారు 75 సంవత్సరాలు పూర్తయిన తర్వాత ఇతరులకు అవకాశం కల్పించాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధినేత మోహన్ భాగవత్ ఇటీవల అన్నమాటలు తీవ్ర చర్చను ఎందుకు ప్రేరేపిస్తున్నాయి? రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అంటే బీజేపీ మాతృసంస్థ. బీజేపీలో ఉన్న అగ్రనాయకులంతా 'సంఘ్' నుంచి వచ్చినవారే. 'ఒక్కసారి స్వయం సేవకుడైతే జీవితాంతం స్వయం సేవకుడే' అని దివంగత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి సగర్వంగా ప్రకటించారు. గత ఏప్రిల్ తుదినాళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగపూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయానికి వెళ్లినప్పుడు స్వయం సేవకులను ఉద్దేశించి మాట్లాడుతూ 'మనం..' అనే పదాన్ని ఉపయోగించారు. తాను స్వయం సేవకుడిని కాదని మోదీ ఎప్పుడూ అనలేదు.ఇంతకూ మోహన్ భాగవత్ వ్యాఖ్యలపై చర్చిస్తున్నది ఎవరు అన్నది ప్రధానం. భాగవత్ అలా ప్రకటించగానే కాంగ్రెస్ నేతలు సంబరపడిపోయారు. తన మనుగడకు మోదీ ఎంత ప్రమాదకరమో కాంగ్రెస్ భావిస్తున్నందువల్లే ఆ పార్టీ నాయకులు సంబరాన్ని ప్రకటించా రనడంలో అతిశయోక్తి లేదు. 2014లో మోదీ ప్రధానిగా ఎన్నికైనప్పటి నుంచీ కాంగ్రెస్ జీవన్మరణ సంఘర్షణ చేస్తూనే ఉన్నది. ఒకో రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోతూ వస్తోంది. మోదీని ఢీకొనడానికి బలమైన రాజకీయ కార్యాచరణ ఎలా నిర్మించాలా అన్న విషయం కాంగ్రెస్ నేతలకు అంతుపట్టడం లేదు. మోదీనే కాదు, ఆయన మూలంగా విస్తరిస్తోన్న భావజాలాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రత్యామ్నాయ భావజాలం కాంగ్రెస్ కానీ, ఇతర ప్రతిపక్షాలు కానీ, వామపక్ష మేధావులు కానీ ఇంకా సమకూర్చుకోవాల్సి ఉన్నది. అందువల్ల తాము ఓడించలేని మోదీని సంఘ్ పరివార్ పక్కకు తప్పిస్తుందని ఆశపడడంలో అర్థం లేదు. మోదీ ఉన్నా, లేకపోయినా మోదీ ఒక మహాశక్తిగా రూపొందడానికి కారణమైన భావజాలాన్ని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు శక్తులు ఎలా ఎదుర్కోగలవా అని సామాజిక విశ్లేషకులు ఆలోచిస్తున్నారు. 82 ఏళ్లు నిండిన మల్లికార్జున ఖర్గేని పార్టీ అధ్యక్షుడుగా, 78 ఏళ్ల వయసులో సోనియాను రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగిస్తున్న కాంగ్రెస్ ఇతర పార్టీల నేతల వయసు గురించి మాట్లాడడం అసమంజసంగానే ఉంటుంది.మోదీ స్వయం సేవకుడే. అంతమాత్రాన మోహన్ భాగవత్ వ్యక్తం చేసిన అభిప్రాయం మోదీకి కూడా వర్తిస్తుందని అనడానికి వీల్లేదు. బహుశా, భాగవత్ స్వయంగా తన గురించి ఈ అభిప్రాయం వ్యక్తం చేసి ఉండవచ్చు. ఆయనకు కూడా సెప్టెంబర్‌లోనే 75 ఏళ్లు పూర్తి కానున్నాయి. గత ఏప్రిల్‌లో మోదీ నాగపూర్‌కు వెళ్లినప్పుడు ఆయనను పదవీ విరమణ చేయమని సంఘ్ అడిగిందని శివసేన నేత సంజయ్ రౌత్ చెప్పారు. మోదీ త్వరలో పదవీవిరమణ చేస్తారని, అమిత్ షాకు అధికారం అప్పజెబుతారని గత ఏడాది ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ ఊహాగానం చేశారు. అసలు బీజేపీ వ్యవహారాలపై మాట్లాడే హక్కు వారికేమున్నది? ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే కేజ్రీవాల్, సంజయ్ రౌత్ వ్యాఖ్యానించినప్పుడు అమిత్ షా, దేవేంద్ర ఫడణవీస్ వంటి నేతలు వెంటనే ఖండించారు. 75 సంవత్సరాలు దాటినంత మాత్రాన మోదీ పదవీవిరమణ చేయాలన్న నిబంధన ఏమీ లేదని వారు స్పష్టం చేశారు. గమనార్హమేమిటంటే మోహన్ భాగవత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందిస్తూ మోదీని సంఘ్ ఇంటికి పంపాలనుకుంటున్నదని వ్యాఖ్యానిస్తే బీజేపీ నేతలు ఎవరూ మాట్లాడలేదు. అంతా నీరవ నిశ్శబ్దం నెలకొన్నది. అయినప్పటికీ భాగవత్ వ్యాఖ్యలు మోదీకి వర్తిస్తాయని చెప్పేందుకు వీల్లేదు. ఎందుకంటే సంఘ్ పెద్దల వ్యాఖ్యలపై బీజేపీ నేతెలు ఎవరూ వ్యాఖ్యానించే అవకాశం ఏ మాత్రం లేదు. ఇది సంఘ్ లోనూ, పార్టీలోనూ అందరూ పాటించే క్రమశిక్షణ. సంఘ్ పెద్దలు ఏ వ్యాఖ్యలు చేసినా అది తమ అంతర్గత వ్యవహారమని వారు భావిస్తారు. అంతేకాదు, మోదీ పది సంవత్సరాలకు పైగా అధికారంలో ఉన్నా, బీజేపీలో ఎక్కడా ఆయనకు వ్యతిరేకంగా రణ గొణ ధ్వనులు వినిపించలేదు.

# వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ పట్ల ఎలా ప్రవర్తించారో తెలిస్తే..



పశ్చిమగోదావరి,జూలై 16 (సందేశం టైమ్స్): :వివాహేతర సంబంధాలు దంపతుల మధ్య చిచ్చుపెడుతున్నాయి. దాంపత్య జీవితం చక్కగా సాగిపోతున్న తరుణంలో భర్తకు లేదా భార్యకు వేరే వాళ్లతో సంబంధాల కారణంగా వారి సంసారం బీటలు వారుతున్న పరిస్థితి. అక్రమసంబంధాల కారణంగా ప్రియుడితో కలిసి భర్తను చంపిన ఘటనలు, ప్రియురాలితో కలిసి భార్యను పొట్టనపెట్టుకున్న ఘటనలు ఎన్నో చూశాం. ఇక పలు చోట్ల వివాహేతర సంబంధాల గురించి తెలుసుకున్న భార్య లేదా భర్త.. వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని చితకబాదిన సంఘటనలు అనేకం. అంతేకాకుండా అక్రమ సంబంధాలు పెట్టుకున్న వారి పట్ల ఆయా గ్రామస్థులు ప్రవర్తించి తీరు, వారిని హింసించిన దృశ్యాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. తాజాగా పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ పట్ల గ్రామస్థులు అమానుషంగా ప్రవర్తించారు.జిల్లాలోని పాలకోడేరు మండలం మోగల్లు శివారు గుత్తులవారిపాలెంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. వివాహేతర సంబంధం ఉందని మహిళను స్థంభానికి కట్టేసి కొట్టిన వైనం కలకలం రేపుతోంది. గ్రామానికి చెందిన సుబ్బారావు అనే వ్యక్తి విజయలక్ష్మితో అక్రమసంబంధం పెట్టుకుని అత్తిలిలో నివాసం ఉంటున్నాడు. విషయం తెలిసిన సుబ్బారావు భార్య వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఆపై విజయలక్ష్మిని సుబ్బారావు భార్య, కుటుంబ సభ్యులు కలిసి గుత్తులవారిపాలానికి తీసుకునివచ్చారు. రాత్రి నుంచి సదరు మహిళను కొడుతూ చిత్రహింసలకు గురిచేశారు. అక్రమ సంబంధం కారణంగా మహిళను చితకబాదినట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని వారి నుంచి విజయలక్ష్మిని విడిపించారు. తీవ్రంగా గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# బైక్‌పై తీసుకెళ్లాడు.. ఒంటరిగా తిరిగొచ్చాడు

## గండికోటలో బాలిక దారుణ హత్య
## ముళ్లపొదల్లో ఇంటర్ విద్యార్థిని మృతదేహం
## పోలీసుల అదుపులో అనుమానితుడు లోకేశ్?




జమ్మలమడుగు, జూలై 16 (సందేశం టైమ్స్): పర్యాటక కేంద్రంగా ఎంతో ప్రత్యేకత ఉన్న గండికోటలో ఓ బాలిక దారుణ హత్యకు గురైంది. ఓ యువకుడు బైక్‌పై ఆమెను తీసుకెళ్లి, వచ్చేటప్పుడు ఒక్కడే రావడంతో అతడే చంపేసి ఉ ంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి జమ్మలమడుగు పోలీసులు, బాధితుల కథనం ఇలా ఉ ంది. ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తికి చెందిన పసుపులేటి కొండయ్య, దస్తగిరమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. వీరు పిల్లల చదువులకోసం ప్రొద్దుటూరు గాంధీరోడ్డులోని సార్వకట్ట వీ?ధిలో ఉంటున్నారు. వీరి కుమార్తె పసుపులేటి వైష్ణవి (17) ప్రొద్దుటూరులో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం కాలేజీకని ఇంటి నుంచి బయలుదేరింది. బాలిక కాలేజీకి రాలేదని అధ్యాపకులు వైష్ణవి తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. వెంటనే వారు కాలేజీకి వెళ్లి వైష్ణవి స్నేహితులను ఆరా తీశారు. గట్టిగా ప్రశ్నించగా.. గండికోటకు వెళ్లిందని కొందరు, కడపకు వెళ్లిందని కొందరు చెప్పారు. కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరులో సాయంత్రం వరకు వెతికి.. ఆచూకీ తెలియకపోవడంతో ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉదయం గండికోటలోని రంగనాథస్వామి ఆలయం వెనుక భాగంలోని ముళ్లపొదల్లో బాలిక మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, బాధితులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. ఆ మృతదేహం వైష్ణవిదిగా గుర్తించి, జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టి కొన్ని ఆధారాలు సేకరించింది.

# అర్హత, శిక్షణ ఉంటేనే డిప్యుటేషన్

## పీఆర్, రెవెన్యూ, స్టేట్ ఆడిట్, సచివాలయ శాఖల వారికి మాత్రమే
## కొత్త మార్గదర్శకాలతో మున్సిపల్ శాఖ ఉత్తర్వులు



అమరావతి, జూలై 16 (సందేశం టైమ్స్): తగిన అర్హత, శిక్షణ ఉంటేనే ఇకపై మున్సిపల్ శాఖలో కమిషనర్, అడిషనల్ కమిషనర్‌గా పని చేసేందుకు అవకాశం ఇస్తారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. వీటి ప్రకారం.. పట్టణ పాలన, సమస్యలపై ప్రాథమిక పరిజ్ఞానం ఉన్న సంబంధిత మున్సిపల్ సంస్థ గ్రేడ్‌కు అనుగుణంగా జీతభత్యాలు పొందే అధికారులు మాత్రవేం అర్హులవుతారు. పంచాయతీరాజ్‌శాఖకు చెందిన ఎంపీడీవోలు, డీఎల్‌డీవోలు, డిప్యూటీ సీఈవోలు, జిల్లా పరిషత్ సీఈవోలను వివిధ గ్రేడ్‌ల మున్సిపాలిటీలకు నియమిస్తారు. రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు, స్టేట్ ఆడిట్ శాఖ నుంచి అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్లు, జిల్లా ఆడిట్ ఆఫీసర్లు, సచివాలయ శాఖ నుంచి సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్రటరీలను డిప్యుటేషన్‌పై నియమించనున్నారు. డిప్యుటేషన్‌పై వచ్చే అధికారులకు ప్రొబేషన్, ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసి ఉండాలి. డిగ్రీ పూర్తిచేసి, ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. విజిలెన్స్ క్లియరెన్స్, మాతృ శాఖ అనుమతి ఉండాలి. డిప్యుటేషన్‌పై వచ్చేవారికి శాఖాపరమైన శిక్షణ ఇస్తారు.

# 28.35 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్

సత్తెనపల్లి రూరల్ :జూలై 16 (సందేశం టైమ్స్): సత్తెనపల్లి పట్టణంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏలూరు జిల్లా సహాయ వ్యవసాయ సహాయకులు కోట రామచంద్రరావు, పిజి బుజ్జిబాబు, విజయవాడ రీజినల్ విజిలెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఉమర్, మండల వ్యవసాయాధికారి బి.సుబ్బారెడ్డి తనిఖీలు చేయగా రైతులకు అమ్మిన సరుకు వివరాలు స్టాక్ రిజిస్టరులో నమోదు చేయకపోవటం, నిల్వల్లో వ్యత్యాసాలను గుర్తించారు. రూ. 7.43 లక్షల విలువ గల 28.35 మెట్రిక్ టన్నులు ఎరువుల విక్రయాలను నిలిపేశారు.



# క్రీడావార్తలు



## మూడో టెస్ట్ ఓటమికి జడేజానే కారణం.. విమర్శకులకు పుజారా స్ట్రాంగ్ రిప్లై..



ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా స్వల్ప తేడాతో ఓటమి పాలైంది. 22 పరుగుల స్వల్ప తేడాతో పరాజయం మూటగట్టుకుంది. ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా అద్భుత పోరాట పటిమను ప్రదర్శించాడు. 181 బంతులు ఆడి 61 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. టీమిండియాను గెలిపించేందుకు చివరి వరకు ప్రయత్నించాడు. అయితే దురదృష్టం వెంటాడడంతో టీమిండియా ఓటమి పాలైంది టీమిండియా ఓటమి పాలవడానికి జడేజానే కారణమని కొందరు మాజీలు విమర్శిస్తున్నారు. జడేజా మొదటి నుంచే కాస్త వేగంగా ఆడి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని కొందరు అభిప్రాయపడ్డారు. జడేజా డిఫెన్సివ్ మైండ్‌సెట్ కారణంగానే టీమిండియా ఓడిపోయిందని విమర్శిస్తున్నారు. టీమిండియా మాజీ క్రికెటర్లు గంగూలీ, అనిల్ కుంబ్లే, సునీల్ గవాస్కర్, అశ్విన్ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వీరిపై మరో మాజీ క్రికెటర్ ఛతేశ్వర్ పూజారా ఆగ్రహం వ్యక్తం చేశాడు. వారి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చాడు.

## ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్‌లో ఆ స్టార్స్ ఇద్దరూ ఆడతారా..



లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో ఓటమి పాలైన టీమిండియా ప్రస్తుతం నాలుగో టెస్ట్ మ్యాచ్ గెలవడంపై దృష్టి సారించింది. మూడు, నాలుగు టెస్ట్ మ్యాచ్‌లకు మధ్యలో దాదాపు పది రోజుల విరామం వచ్చింది. నాలుగో టెస్ట్ మ్యాచ్ మంచెస్టర్‌లో జులై 23వ తేదీ నుంచి ప్రారంభం కాబోతోంది. ఆ మ్యాచ్‌లో గెలిస్తేనే టీమిండియా రేస్‌లో నిలిచే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది. ఈ నేపథ్యంలో నాలుగో మ్యాచ్‌లో గెలిస్తేనే టీమిండియా నిలుస్తుంది.నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా కీలక ఆటగాళ్లు రిషభ్ పంత్ , జస్ప్రీత్ బుమ్రా ఆడతారా అనేది అనుమానంగా మారింది. వర్క్‌లోడ్ కారణంగా బుమ్రా నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో ఆడబోయేది లేదని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలపై మాజీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో బుమ్రా కచ్చితంగా ఆడాలని, లేకపోతే ఆ మ్యాచ్‌లో పరిస్థితి టీమిండియాకు అనుకూలంగా ఉండదని చెబుతున్నారు. దీంతో బుమ్రాను ఆడించే విషయంలో జట్టు మేనేజ్‌మెంట్ పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది.ఇక, మూడో టెస్ట్ మ్యాచ్‌లో గాయపడిన రిషభ్ పంత్ కూడా నాలుగో మ్యాచ్‌కు డౌట్‌గానే కనిపిస్తున్నాడు. పంత్ చేతి వేలికి గాయమైన సంగతి తెలిసిందే. దీంతో మూడో టెస్ట్ మ్యాచ్‌లో పంత్ కీపింగ్ కూడా చేయలేకపోయాడు. ఈ నేపథ్యంలో నాలుగో టెస్ట్ మ్యాచ్‌కు పంత్ అందుబాటులో ఉంటాడా అనేది అనుమానంగా మారింది. అయితే పంత్ వేలికి పెద్ద గాయం కాలేదని, కాస్త విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని సమాచారం. ఒకవేళ వీరిద్దరూ దూరమైతే మాత్రం జట్టుకు తీరని లోటే అని ఒప్పుకోక తప్పదు. కాగా, వరుసగా విఫలమవుతున్న కరుణ్ నాయర్‌ను పక్కన పెట్టి నాలుగో టెస్ట్‌లో సాయి సుదర్శన్‌ను తీసుకుంటారని వార్తలు వస్తున్నాయి.

## 114 ఏళ్ల మారథాన్ రన్నర్ ఫౌజా సింగ్ మృతి




చండీగఢ్: 114 ఏళ్ల మారథాన్ రన్నర్ ఫౌజా సింగ్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. సోమవారం ఉదయం జలంధర్‌కు సమీపంలోని తన స్వగ్రామంలో వాకింగ్ కోసం బయటకు వెళ్లినప్పుడు గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందని, తీవ్ర గాయాలైన ఫౌజా సింగ్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని పోలీసులు చెప్పారు. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోపాటు ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తెల్లవారుజామున 3.30 గంటలకు రోడ్డు దాటుతుండగా ఎస్‌యూవీ కారు ఢీ కొట్టిందని కొందరు స్థానికులు చెబుతున్నారుఆ వయసులో పరిగెత్తడం మొదలుపెట్టి..1911లో రైతు కుటుంబంలో జన్మించిన ఫౌజా సింగ్.. నలుగురు సంతానంలో ఆఖరివాడు. భార్య, చిన్న కొడుకు, కుమార్తె మరణంతో కుంగిపోయిన ఫౌజాను మరో కొడుకు 90వ దశకంలో లండన్ తీసుకెళ్లాడు. తన బాధను మరవడానికి రన్నింగ్‌ను ఎంచుకొన్న ఫౌజా .. అందులోనే గుర్తింపు సాధించాడు. 88 ఏళ్ల వయస్సు నప్పుడు ఓ స్వచ్ఛంద సంస్థ కోసం మారథాన్ రేస్‌లో పరుగెత్తాడు. ఆ తర్వాత అనేక అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొని పలు రికార్డులు నెలకొల్పాడు. మారథాన్ రేసును పూర్తి చేసిన శతాధికుడిగా ఖ్యాతికెక్కాడు.

ఫౌజా సింగ్ మృతికి ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. 'ఫౌజా అద్భుతమైన, భిన్నమైన వ్యక్తి. ఫిట్‌నెస్ విషయంలో యువతకు ఆయన స్ఫూర్తిగా నిలిచారు. అలాంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరమ'ని ఎక్స్‌లో మోదీ పోస్టు చేశారు.

## కింగ్ ఛార్లెస్ ఆసక్తికర ప్రశ్న.. శుభ్‌మన్ గిల్ ఏం చెప్పాడంటే..

ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత పురుషుల, మహిళల జట్ల ఆటగాళ్లు బ్రిటన్ రాజు ఛార్లెస్-3 మర్యాదపూర్వకంగా కలిశారు. క్లారెన్స్ హౌస్ గార్డెన్‌లో మంగళవారం ఇరు జట్ల ఆటగాళ్లు ఆయనతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఈ సందర్భంగా ఆయన పలువురు ఆటగాళ్లతో సరదాగా ముచ్చటించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, పేసర్ జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ తదితర ఆటగాళ్లతో మాట్లాడారు. ఇక, తాజాగా లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్, భారత్ జట్ల మధ్య జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్ హైలెట్స్ తాను చూసినట్టు ఆటగాళ్లకు కింగ్ చెప్పారు ఈ సందర్భంగా టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ను గేమ్ గురించి ప్రశ్నించారు. 'మ్యాచ్‌లో చివరి బ్యాటర్ అలా దురదృష్టవశాత్తు అవుట్ కావడం ఎలా అనిపించింది'ని గిల్‌ను అడిగారు. కింగ్ ప్రశ్నకు గిల్ స్పందిస్తూ.. అది చాలా దురదృష్టకరమని, తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో రాణిస్తామని భావిస్తున్నామని బదులిచ్చాడు. అలాగే భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్‌తో కూడా కింగ్ మాట్లాడారు. కింగ్ ఎంతో స్నేహపూర్వకంగా సంభాషించారని హర్మన్ ప్రీత్ పేర్కొంది.లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో టీ బ్రేక్ తర్వాత స్పిన్నర్ బషీర్ వేసిన బంతిని సిరాజ్ బ్యాక్‌ఫుట్‌తో డిఫెన్స్ ఆడాడు. కింద పడిన బంతి సిరాజ్ ప్యాడ్స్ పక్కనుంచి వెళ్లి లెగ్ స్టంప్‌ను తాకింది. సిరాజ్ గమనించేలోపే బెయిల్స్ కూడా కిందపడిపోయాయి. దీంతో సిరాజ్ దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఇంగ్లండ్ ఆటగాళ్లు, ఫ్యాన్స్ సంబరాలు మిన్నంటాయి. సిరాజ్ దురదృష్టవశాత్తు అవుట్ కాకుండా ఉండుంటే ఫలితం మరోలా ఉండేదేమో.



## డ్రాతో గట్టెక్కిన ఇంగ్లండ్

బెకెన్‌హామ్: భారత్ అండర్-19తో జరిగిన తొలి అనధికార టెస్టులో ఇంగ్లండ్ డ్రాతో గట్టెక్కింది. యువ భారత్ నిర్దేశించిన 350 పరుగుల ఛేదనలో.. ఓవర్‌నైట్ స్కోరు 128/3తో చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 270/7 స్కోరు చేసింది. కెప్టెన్ హమ్జా షేక్ (112) శతకంతో రాణించగా.. బెన్ మేయర్స్ (51), థామస్ (50) రాణించారు. అంబ్రిష్ 2 వికెట్లు తీశాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 540, రెండో ఇన్నింగ్స్‌లో 248 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 439 రన్స్‌కు ఆలౌటైంది.




## కింగ్‌తో టీమిండియా

లండన్: ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు బ్రిటన్ రాజు చార్లెస్-3ని మర్యాద పూర్వకంగా కలిశాయి. మంగళవారం క్లారెన్స్ హౌస్ గార్డెన్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు ఆయనతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. అలాగే కెప్టెన్ గిల్, పేసర్లు బుమ్రా, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ తదితర ఆటగాళ్లతో కింగ్ ముచ్చటించారు. అంతేకాకుండా లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్టు హైలైట్స్‌ను తాను చూసినట్టు ప్లేయర్లతో కింగ్ చార్లెస్ అన్నారు. 'బ్రిటన్ కింగ్‌ను కలుసుకోవడం ఆనందంగా ఉంది. అందరితో ఆయన ఆప్యాయంగా



మాట్లాడారు. అలాగే చివరి రోజు ఆటలో సిరాజ్ అవుటైన విధానం దురదృష్టకరమని, బంతి పక్క నుంచి వెళ్లి స్టంప్స్‌ను తాకిందని మాతో అన్నారు' అని గిల్ వివరించాడు.నాలుగో టెస్టు కోసం భారత జట్టులో మార్పులు ఖాయంగా కనిపిస్తున్నాయి. పని ఒత్తిడిలో భాగంగా పేసర్ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది.

## ఎనిమిదేళ్ల తర్వాత జట్టులోకి




లండన్: మాంచెస్టర్ వేదికగా ఈనెల 23 నుంచి జరుగబోయే నాలుగో టెస్టు కోసం 14 మందితో కూడిన ఇంగ్లండ్ జట్టును ప్రకటించారు. అయితే చేతి వేలు ఫ్రాక్చర్ కావడంతో స్పిన్నర్ షోయబ్ బషీర్ మిగిలిన రెండు టెస్టులకు దూరం కానున్నాడు. దీంతో అతడి స్థానంలో 35 ఏళ్ల స్పిన్నర్ లియామ్ డాసన్ (35)కు చోటు కల్పించారు. 2017లో చివరిసారిగా అతను ఇంగ్లండ్ తరఫున మూడు టెస్టులు ఆడి ఏడు వికెట్లు తీయగా, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో బ్యాటింగ్‌లోనూ రాణించి 18 శతకాలతో 10,731 పరుగులు చేయడం విశేషం. ఇక పేసర్లు సామ్ కుక్, ఒవర్టన్‌ను కౌంటీల్లో ఆడేందుకు విడుదల చేశారు.

# బిజినెస్




## అమెరికా వార్నింగ్.. నష్టాల్లో స్టాక్‌మార్కెట్లు..




లాభాలను ఆర్జించిన దేశీయ సూచీలు బుధవారం మళ్లీ నష్టాల బాట పట్టాయి. రష్యాతో వ్యాపారం చేస్తే వంద శాతం సుంకాలు విధిస్తామని భారత్, చైనాలకు నాటో దేశాలు హెచ్చరికలు చేసిన నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు త్రైమాసిక ఫలితాల సీజన్ కావడం కూడా మార్కెట్ల ఒడిదుడుకులకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో కదలాడుతున్నాయి మంగళవారం ముగింపు (82, 570)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల బాట పట్టింది. ఒక దశలో దాదాపు 200 పాయింట్లు కోల్పోయి 82, 371 వద్ద కనిష్టానికి చేరింది. ప్రస్తుతం ఉదయం 10:20 గంటల సమయంలో సెన్సెక్స్ 149 పాయింట్ల నష్టంతో 82, 420 వద్ద కొనసాగుతోంది. మరోవైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 52 పాయింట్ల నష్టంతో 25, 143 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో డిక్సన్ టెక్నాలజీస్, ఆర్బీఎల్ బ్యాంక్, పతంజలి ఫుడ్స్, పేటీఎమ్, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. అంబర్ ఎంటర్‌ప్రైజెస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఏబీబీ ఇండియా, జిందాల్ స్టీల్స్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 50 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 54 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.89గా ఉంది.

## పీఎం కిసాన్ 20వ విడత డబ్బులు రైతులకు ఆ రోజే వస్తాయా..




ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడత మనీ కోసం దేశంలో కోట్లాది మంది రైతులు ఆసక్తిగా చూస్తున్నారు. అయితే ఇది జూలై 18, 2025 (శుక్రవారం) వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానుందని తెలుస్తోంది. కానీ ఈ విషయంపై అధికారిక ప్రకటన రాలేదు. బీహార్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ వారం బీహార్ పర్యటనకు వెళ్తున్నారు.%సమాచారం ప్రకారం, జూలై 18న తూర్పు చంపారన్‌లోని మోతీహారీలో జరిగే భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ 20వ విడతను విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 9.8 కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో రూ. 2,000 చొప్పున నేరుగా జమ చేయడానికి ప్రధాని బటన్ నొక్కే అవకాశం ఉందని సమాచారం.పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 2019లో ప్రారంభమైంది. ఇది దేశంలోని చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక సహాయం అందించడానికి రూపొందించబడింది. ఈ పథకం కింద, అర్హత ఉన్న రైతు కుటుంబాలకు ఏటా రూ. 6,000 మూడు సమాన విడతలలో (ప్రతి నాలుగు నెలలకు రూ. 2,000) వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయబడుతుంది. ఈ నిధులు రైతుల వ్యవసాయ అవసరాలు తీర్చడానికి ఉపయోగపడతాయి. ఇప్పటి వరకు 11 కోట్లకు పైగా రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. మొత్తం రూ. 3 లక్షల కోట్లకు పైగా నిధులు విడుదలయ్యాయి.20వ విడత కోసం రైతులు చేయాల్సిన ముఖ్యమైన పనులుపీఎం కిసాన్ పథకం ప్రయోజనాలను పొందడానికి రైతులు కొన్ని ముఖ్యమైన అంశాలను పాటించాలి.ఆధార్‌తో బ్యాంకు ఖాతా లింక్: రైతుల వారి బ్యాంకు ఖాతా తప్పనిసరిగా ఆధార్ కార్డుతో లింక్ చేసుకోవాలి. దీని ద్వారా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా మనీ ట్రాన్స్?ఫర్ జరుగుతుంది.ఆధార్ సీడింగ్ స్థితిని తనిఖీ చేయండి: మీ బ్యాంకు ఖాతాతో ఆధార్ సీడింగ్ సరిగ్గా జరిగిందా లేదా అనేది నిర్ధారించుకోవాలి%ఢీ% ఆప్షన్ యాక్టివ్‌గా ఉంచండి: ఆధార్‌తో లింక్ చేయబడిన బ్యాంకు ఖాతాలో %ఢీ% ఆప్షన్ తప్పనిసరిగా యాక్టివ్‌గా ఉండాలిఈ-కేవైసీ పూర్తి చేయండి: ఈ-కేవైసీ పూర్తి చేయడం తప్పనిసరి. దీనిని ఆన్‌లైన్‌లో ఓటీపీ ద్వారా లేదా సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ లో బయోమెట్రిక్ ద్వారా పూర్తి చేసుకోవచ్చు.లబ్ధిదారుల జాబితాలో పేరు తనిఖీ: పీఎం కిసాన్ పోర్టల్‌లోని ఆప్షన్ ద్వారా మీ పేరు లబ్ధిదారుల జాబితాలో ఉందో లేదో చెక్ చేసుకోవచ్చు.

## టెస్లా.. ఆగయా




ముంబై: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా ఎట్టకేలకు భారత్‌లోకి ప్రవేశించింది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో కంపెనీ ఏర్పాటు చేసిన తొలి షోరూమ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ మంగళవారం ప్రారంభించారు. టెస్లా భారత్‌లో కార్ల తయారీ ప్లాంట్, ఆర్ అండ్ డీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.బెస్ట్ సెల్లింగ్ మోడల్‌తో ఎంట్రీ: ఒకప్పుడు ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడైన ఎలక్ట్రిక్ కారైన 'మోడల్ వై'తో టెస్లా భారత మార్కెట్ విక్రయాలను ప్రారంభించింది. మన దగ్గర ఈ కారు రెండు వేరియంట్లలో లభించనుంది. రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్ ధర రూ.59.89 లక్షలు. లాంగ్ రేంజ్ రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్ రేటును రూ.67.89 లక్షలుగా నిర్ణయించింది. ఈ కారును బుక్ చేసుకున్న కస్టమర్లకు ఈ ఏడాది మూడు (జూలై-సెప్టెంబరు), నాలుగో (అక్టోబరు-డిసెంబరు) త్రైమాసికాల్లో డెలివరీ అందించనున్నట్లు వెల్లడించింది. కారు రిజిస్ట్రేషన్, డెలివరీ సేవలు తొలుత ఢిల్లీ, ముంబై, గురుగ్రామ్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపింది.సింగిల్ చార్జింగ్‌తో 500 కి.మీ ప్రయాణం:

## స్వల్పంగా తగ్గిన బంగారం ధర.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



బంగారం ధర మళ్లీ లక్ష రూపాయలకు చేరువ అవుతోంది. గత వారంలో 98 వేలకు దగ్గర్లో ఉన్న పది గ్రాముల బంగారం ప్రస్తుతం తిరిగి లక్ష రూపాయలు చేరువ అయింది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జూలై 16న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 99, 760కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 91, 440కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ.140 వరకు తగ్గింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 99, 910కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 91, 590కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99, 760కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 91, 440కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

## 133 దేశాలకు అరబిందో హెచ్ఐవీ ఔషధం




హైదరాబాద్: ప్రపంచంలోని 133 దేశాల్లో హెచ్ఐవీ చికిత్సలో ఉపయోగించే ఇంజెక్షన్ కాబోటెగ్రవిర్‌ను అరబిందో ఫార్మా తయారుచేసి, సరఫరా చేయనుంది. మెడిసిన్స్ పేటెంట్ పూల్ (ఎంపీపీ), వీఐవీ హెల్త్‌కేర్ మధ్య విస్తరించిన వాలంటరీ లైసెన్సింగ్ ఒప్పందం కింద కాబోటెగ్రవిర్ తయారు చేసేందుకు ఎంపి క చేసిన జెనరిక్ ఔషధ తయారీదారుల్లో అరబిందో ఒకటి. హెచ్ఐవీ రోగులు రోజువారీ మాత్రలు మింగడాన్ని ఈ చికిత్స నివారిస్తుంది. అందుకు బదులుగా వారు 1 లేదా 2 నెలలకి ఒక ఇంజెక్షన్ తీసుకుంటే సరిపోతుంది. ఎంపిక చేసిన మార్కెట్లలో ఈ ఔషధం అభివృద్ధి, తయారీ, పంపిణీకి సబ్ లైసెన్స్ లభించడం ఆనందదాయకమని కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ నిత్యానందరెడ్డి అన్నారు.

## కియా కారెన్స్ క్లావిస్ ఈవీ




న్యూఢిల్లీ: కియా ఇండియా.. మార్కెట్లోకి కారెన్స్ క్లావిస్ ఎలక్ట్రిక్ కారు (ఈవీ)ను విడుదల చేసింది. కంపెనీ భారత్‌లో ఉత్పత్తి చేసిన తొలి ఎలక్ట్రిక్ కారు ఇదే. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం ప్లాంట్‌లో ఈ ఎలక్ట్రిక్ కారును కంపెనీ తయారు చేసింది. ఈ కారు ధర రూ.17.99 లక్షల నుంచి రూ.24.49 లక్షల (ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉంది. 42 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో కూడిన కారు ఒకసారి చార్జింగ్‌తో రూ.404 కిలోమీటర్ల దూరం ప్రయాణించనుంది. అలాగే 51.4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో కూడిన కారు 490 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని కియా తెలిపింది. 100 కిలోవాట్ డీసీ చార్జర్‌తో కేవలం 39 నిమిషాల్లోనే 10 నుంచి 80 శాతం బ్యాటరీ చార్జింగ్ అవుతుందని పేర్కొంది. ఏడు సీట్ల క్లావిస్ ఈవీలో ఏడీఏఎస్ లెవెల్ 2 వ్యవస్థతో పాటు 20కి పైగా అటానమస్ ఫీచర్లను పొందుపరిచినట్లు కియా తెలిపింది. కాగా కియా ఇప్పటికే ఎలక్ట్రిక్ కార్లయిన ఈవీ6, ఈవీ9 మోడళ్లను దిగుమతి చేసుకుని భారత మార్కెట్లో విక్రయిస్తోంది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006